ఆంధ్రజ్యోతి
గరిష్ఠం : 29.0
కనిష్ఠం : 18.0
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
గురువారం 13 నవంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.60 (305.8626)	34,468	37,779
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.30 (4.28)	1566.19	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.587 (43.5968)	35,233	65,064

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240

జిల్లాలో త్వరలో భూసర్వే



బీఆర్ఎస్ హయాంలో తీసుకువచ్చిన ధరణి స్థానంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ద్వారా భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మొదటగా గ్రామాల్లో భూములను సర్వే చేయాలని నిర్ణయించింది. సర్వే అనంతరం సంబంధిత భూయజమానికి అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా భూదార్ నెంబరు కేటాయిస్తారు. అనంతరం భూభారతి చట్టం వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. దీంతో భూవివరాలు పక్కాగా నమోదు కానున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సర్వే ప్రారంభించనున్నారు.

- మొదటి విడతలో 70 గ్రామాల్లో
- గ్రామాల ఎంపిక పూర్తి
- ప్రతీ మండలం నుంచి రెండు నుంచి ఐదు గ్రామాలు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

జిల్లాలో త్వరలో భూముల సర్వే చేపట్టనున్నారు. మొదటి విడతలో 70 గ్రామాల్లో సర్వే చేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంచేశారు. జిల్లాలోని 23 మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రతీ మండలంలో రెండు నుంచి ఐదు గ్రామాలను ఎంపికచేశారు. మేజర్ గ్రామపంచాయతీల్లో కాకుండా తక్కువ భూవిస్తీర్ణం కలిగిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతలో సర్వే నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. సర్వే చేసే గ్రామాలను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

భూములకు భూదార్ నెంబరు

భూసర్వే అనంతరం సంబంధింత భూములకు ప్రభుత్వం భూదార్ నెం బరును కేటాయించనుంది. ప్రస్తుతం రైతులు సాగులో ఉన్న భూములను సర్వే చేస్తారు. సంబంధిత భూముల పక్కన ఉన్న రైతులు సర్వే విషయంలో ఏమైనా అభ్యంతరాలు తెలిపితే అక్కడ సర్వే నిలిపివేసి మరోచోట సర్వే చేస్తారు. సర్వేతో ఎవరి భూములు ఎంత ఉండాలో తెలవడంతో పాటు ఎంత విస్తీర్ణంలో సాగులో ఉన్నారో కూడా తేలిపోనుంది. గతంలో సర్వేయర్లు టీపన్ను ఆధారంగా కేవలం సర్వే నెంబరును మాత్రమే సర్వే చేసి గుర్తించే వారు. సదరు సర్వే

(మిగతా 8వ పేజీలో)

160 మంది సర్వేయర్లు

జిల్లాలో భూముల సర్వేను 160మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా చేపట్టనున్నారు. గతంలో జిల్లాలోని 10 మందికి తోడు ఇటీవల ప్రభుత్వం నియామకం చేసిన 150 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు భూముల సర్వేలో పాల్గొననున్నారు. జిల్లాలో అన్నిరకాల భూములు కలిపి మొత్తం 8.85లక్షల ఎకరాలు ఉన్నాయి. ఆయా భూముల్లో మొదటి విడతలో కొన్ని వేల ఎకరాల్లో మాత్రమే సర్వే చేయనున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే సర్వే



ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే జిల్లాలో భూసర్వే ప్రారంభిస్తాం. భూముల సర్వే కోసం ఇప్పటికే జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి నివేదికను పంపించాం. భూముల సర్వే కోసం లైసెన్స్‌డ్ సర్వేయర్లు 160 మంది సిద్ధం చేశాం. భూసర్వేతో భూసమస్యలు పరిష్కారం కానున్నాయి. భూముల సర్వే విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

సీతారామారావు, అదనపు కలెక్టర్

రెండేళ్లుగా ప్రహసనం

జిల్లాలో రేషన్‌కార్డుల ఈ-కేవైసీ పూర్తిస్థాయిలో నేటికీ పూర్తి కాలేదు. కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ప్రతీ రేషన్‌కార్డుదారుడు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే అది నేటికీ సంపూర్ణం కాలేదు. ప్రస్తుతం జిల్లాలో 75 శాతం అయినట్లు అధికారులు తెలిపారు.

- కొనసాగుతున్న రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియ
- తప్పనిసరి అంటున్న అధికారులు



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)

రేషన్‌కార్డుదారుల్లో కొందరు ప్రతి నెలా సరుకులు తీసుకోవడం లేదు. ఇలాంటి వారిని గుర్తించేందుకు, అనర్హులను తొలగించేందుకు ప్రభుత్వం ఈ-కేవైసీ పూర్తి చేయడాన్ని ప్రభు త్వం ఐచ్ఛితం చేసింది. జిల్లాలో మొత్తం రేషన్‌కార్డులు 3,60,112 ఉన్నాయి. వీటి ద్వారా 10.62 లక్షల మంది సరుకులు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 7.86 లక్షల మంది ఈ-కేవైసీ పూర్తి చేశారు. ఈ-కేవైసీ మూలంగా రేషన్‌కార్డులో ఉన్న వారు ఎవరైనా చనిపోయిన వెం టనే గుర్తించే అవకాశం ఉంటుంది. ఈ-కేవైసీ చేయించుకోకపోవడం మూలంగా చనిపోయిన వారికి సైతం రేషన్‌బియ్యం కోటా వస్తోంది. అదేవిధంగా వరుసగా ఆరు నెలల వరకు బియ్యం తీసుకోని వారిపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియలో అనర్హులను తొలగించే వీలుంటుంది. అంతేకాకుండా ఇటీవల నూతనకార్డులను సైతం అందజేశారు. మొత్తంగా రెండేళ్ల నుంచి ఈ-కేవైసీ ప్రక్రియ ప్రహసనంలా సాగుతోంది. ఈ-కేవైసీ పూర్తయితే అర్హులకు మాత్రమే బియ్యం అందే అవకాశం ఉంటుంది.

జిల్లాల్లో సరుకుల పంపిణీ ఇలా

జిల్లాలో 610 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 3,66,064 రేషన్‌కార్డులు ఉన్నాయి. అందులో ఆహార భద్రత కార్డులు, అంత్యోదయ కార్డులు, అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ఈ లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతి నెలా 68వేల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తోంది. ముఖ్యంగా రేషన్ బియ్యం తీసుకునే సందర్భంలో ఈ-కేవైసీ చేయించుకోవాలని పలు మార్లు రేషన్‌డీలర్‌లు చెబుతున్నా ఆ దిశగా లబ్ధిదారులు ఆసక్తి చూపడంలేదు. ముఖ్యంగా ఈ ప్రక్రియలో తమ పేరును నమోదు చేసుకోవడంలో లబ్ధిదారులు పూర్తిస్థాయిలో ముందుకు రావడంలేదు. దీనికి తోడు అధికారులు సైతం ఈ-కేవైసీ పూర్తి చేయడంపై సరైనా

(మిగతా 8వ పేజీలో)

కృష్ణా జలాలు అందాయా
ఆలోచించండి
● నల్లగొండలో వివిధ వర్గాల వారితో సమావేశం
● ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
7

అంతర పంటతో
ఆదాయం
● బొప్పాయి తోటలో అంతరపంటగా బంతిసాగు
● లాభాలు గడిస్తున్న రైతు
6

సిరికొండ వీబీకేకు
పోటాపోటీ
8

ఆదమరిస్తే
ప్రమాదమే
● రోడ్డు పక్కనే చెరువులు, బావులు
8

రైతులకు బాసటగా ప్రభుత్వం

- మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గరిడేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు బాసటగా ఉంటూ, ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. 75 ఏళ్లుగా ఏ రాష్ట్రంలో పండని పంట ఈ వానాకాలం సీజన్‌లో తెలంగాణలో 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందన్నారు. కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం విక్రయాల వివరాలను నమోదు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా ఉంచడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, పయిడిమర్రి రంగనాథ్, పెండెం శ్రీనివాస్‌గౌడ్, కటకం రమేష్, సుందరి నాగేశ్వరరావు, గుండు రామాంజి, సీతారాంరెడ్డి, షక్ చాంద్‌మియా, పరమేష్, కడప దేవదానం, పెండెం ముత్యాలు, నర్సిరెడ్డి, చిరంజీవి, రజిత పాల్గొన్నారు.



గడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నష్టపరిహారానికి కృషి చేస్తా

కోదాడరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతులకు అండగా ఉంటుందన్నారు. తుపాన్ కారణంగా పంటనష్టపోయిన రైతులను ఆదుకుంటామని, అధికారులు ఇచ్చిన నివేధిక ఆధారంగా నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఏఒక్క రైతు కూడా అధైర్య పడాల్సిన అవసరంలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్ కూడా చెల్లించేందుకు ఆదేశాలిచ్చామన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

మఠంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ నియోజకవర్గంలో విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బక్కమంతులగూడెం గ్రామంలో నిర్మించిన అదనపు తరగతి గదులను మంత్రి ప్రారంభించి, మాట్లాడారు. హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను రూ.13 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. రూ.100 కోట్లతో వ్యవసాయ కళాశాల, గడ్డిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.

కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, సీఐ చరమంద రాజు, తహసీల్దార్ మంగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్, తన్నీరు మల్లికార్జున్‌రావు, ఆదూరి కిషోర్‌రెడ్డి, గోవిందరెడ్డి, ఎల్లారెడ్డి, సక్ర నాయక్, బీ.బాబు, వీ.శ్రీనివాస్, వీరారెడ్డి, సీతారాంరెడ్డి, వెంకన్న, భాస్కర్‌రెడ్డి, అజీజ్‌పాషా పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనాధారం మెరుగుపడేలా చూడాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెరువుల్లో ఉచిత చేపపిల్లల పంపిణీ ద్వారా మత్స్యకారుల జీవనాధారం మెరుగుపడేలా చూడాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. ఉచిత చేపపిల్లల పంపిణీపై వివిధ శాఖల అధికారులతో బుధవారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పులిచింతల, యాతవాకిళ్ల రిజర్వాయర్లలో 37.99లక్షల పెద్ద చేపపిల్లలను పంపిణీ చేస్తామన్నారు. అదేవిధంగా 186 శాశ్వత చెరువుల్లో రెండు కోట్ల పెద్దచేపపిల్లలు, 431కుంటల్లో 97.67లక్షల చిన్నచేపపిల్లలను పంపిణీ చేస్తామన్నారు. రూ.4.40కోట్లతో బొచ్చ, రోహు, గడ్డిచేప జాతులకు చెందిన మూడుకోట్ల చేపపిల్లలను పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నిండి ఉన్నాయన్నారు. చేపపిల్లల పంపిణీ కారణంగా నీరుకాలుష్యం కాకుండా చూడాలన్నారు. చేపపిల్లల పంపిణీలో అవకతవకలు జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగులునాయక్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ చట్టం హక్కులను తెలియజేయాలి

సీనియర్ సిటిజన్ చట్టం ద్వారా కలిగే హక్కుల గురించి వయో వృద్ధులకు తెలియచేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవకార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు, వయో వృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు విద్యాసాగర్, హమీద్‌ఖాన్, రాంబాబు, కృష్ణారెడ్డి, కిరణ్మయి, జావెద్‌ఖాన్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న సంఘం నాయకులు, విద్యార్థులు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భారీ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంలో విద్యార్థులు, నిరుద్యోగులదే ప్రధాన పాత్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏవో సుదర్శన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు జనార్ధన్, మహేష్, టీఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి మడ్డిపల్లి సాయి, సుమన్, రఘు, లోకేష్, తండు వేణు, సాయి తదితరులు పాల్గొన్నారు.

తెలామిన్ ఆవిష్కరణ పశుపోషకులకు వరం



తెలామిన్ బ్రాండ్ లోగోను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

కోదాడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బ్రాండ్ మినరల్ మిక్సర్ 'తెలామిన్' ఆవిష్కరణ పశుపోషకులకు వరమని జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో తెలామిన్ బ్రాండ్ లోగోను ఆవిష్కరించి, మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం తయారుచేసిన ఈ ఖనిజ లవణ మిశ్రమం పశుపోషకులకు మేపు ఖర్చు తగ్గించి, లాభసాటి పాలసిరులు కురిపిస్తోందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌డైరెక్టర్ పెంటయ్య, కోదాడ, అనంతగిరి మండలాల పశువైద్యాధికారులు భూక్య మధు, సిరిపురపు సురేంద్ర పాల్గొన్నారు

రైతులకు చట్టాలను చుట్టం చేయటమే లక్ష్యం



తొండ గ్రామ రైతువేదికలో మాట్లాడుతున్న రైతు కమిషన్ సభ్యుడు సునీల్

తిరుమలగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు చట్టాలను చుట్టముగా చేయటమే లక్ష్యంగా లీఫ్స్ సంస్థ పని చేస్తోందని రాష్ట్ర లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. సాగు న్యాయయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని తొండ గ్రామ రైతువేదికలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు చట్టాల గురించి తెలుసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతిలో రైతులకు భూమి ఉండి రికార్డులో లేకపోతే రికార్డులో ఎక్కడం జరుగుతుందన్నారు. గతంలో వ్యవసాయానికి ఇప్పటి వ్యవసాయానికి తేడా ఉందని, వ్యవసాయంలో మార్పులు వచ్చాయన్నారు. వాటికి అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలన్నారు. గతంలో వ్యవసాయం వ్యాపారంగా లేకపోయేదని, ఇప్పుడు వ్యాపారంగా మారిందని దీనికి అనుగుణంగా రైతులు మార్పు చెందాలన్నారు. ప్రభుత్వం కొత్త చట్టం ధరణి తెచ్చిన తర్వాత 20 లక్షల దరఖాస్తులు వచ్చాయని, కొన్ని పరిష్కారం అయ్యాయని మరిన్ని కావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో భూమి లేకున్నా 1,50,000 ఎకరాల భూమి రికార్డుల్లో పెరిగిందని, దీని ప్రకారం రైతు భరోసా తీసుకుంటున్నారన్నారు. దీనిపై సమగ్ర సర్వే జరుగుతుందని ఈ మోసాలను అరికట్టేందుకే భూభారతి వచ్చిందన్నారు. గ్రామస్థాయిలో రైతు సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకు వచ్చేందుకు వ్యక్తి అవసరమని ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. భూసమస్యలపై రైతులను సలహా, సూచనలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, మండల వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, రైతులు అశోక్‌రెడ్డి, మల్లయ్య, పీ రాజయ్య, యాదగిరి, లీఫ్స్ సంస్థ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సభ్యులు అభిలాష్, మల్లేష్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

సూర్యాపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):ఈ విద్యాసంవత్సరం పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర విద్యాశాఖ(మోడల్‌స్కూల్) అదనపు సంచాలకులు శ్రీనివాస్‌చారి అన్నారు. బుధవారం మండలంలోని ఇమాంపేట మోడల్‌స్కూల్‌ను ఆయన తనిఖీచేశారు. తరగతి గదులు, ప్రయోగశాలలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతుల తీరును అడిగి తెలుసుకున్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన ఉండాలన్నారు. పాఠశాల నిర్వహణ, విద్యాబోధనపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంవో రవికుమార్, ప్రిన్సిపాల్ సైదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి / ఆత్మకూరు(ఎస్): తిరుమలగిరి మండలం అనంతారం, ఆత్మకూరు(ఎస్)లోని మోడల్ స్కూళ్లను అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసాచారి సందర్శించారు. విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయుల బోధన విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నాడు. ఆత్మకూరు(ఎస్)లో డిస్కస్‌త్రో పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని సుప్రియను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏఎంవో రవి, ప్రిన్సిపాల్ సంజీవ, క్రాంతి కిరణ్‌రెడ్డి, జమీల బేగం, ఇందిర, సంగీత పాల్గొన్నారు.



ఇమాంపేట మోడల్ స్కూల్లో విద్యార్థులో మాట్లాడుతున్న అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి

మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి



నూతనకల్‌లో దుకాణాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్, పీడీ

నూతనకల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతంలోని మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని సెర్ప్ డైరెక్టర్ జాన్సన్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో నాన్‌ఫామ్ జాన్సన్ ఎంటర్‌ప్రైజెస్‌కు సంబంధించిన మిల్క్ ప్రొడక్ట్ యూనిట్, టీ పొడి కిరాణ దుకాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో రాణించడానికి ప్రభుత్వం అన్నివిధాలుగా సహాయసహకారాలు అందిస్తోందన్నారు. ఆయన వెంట డీఆర్‌డీవో పీడీ అప్పారావు, ఏపీవో సురేష్, డీపీఎంలు అరుణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఏపీఎంలు నగేష్, వెంకట్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

టీకాల పంపిణీ 100 శాతం పూర్తిచేయాలి



తుంగతుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమాన్ని 100శాతం పూర్తి చేయాలని జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తుంగతుర్తిలోని ప్రాంతీయ కార్యాలయంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఇప్పటివరకు నియోజకవర్గాల వారీగా 34,300లకు 24,250 పశు వులకు టీకాలు వేశారని తెలిపారు. జిల్లాలో మొత్తం 12 బృందాలు టీకాల పంపిణీ చేపడుతున్నాయన్నారు. మిగతా పశువులకు ఈ నెల 14 వరకు పూర్తి చేయాలని సూచించారు. పశుపోషకులు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా లాభాలు గడించవచ్చన్నారు. సమావేశంలో సహాయ సంచాలకుడు డాక్టర్ వెంకన్న, రవిప్రసాద్, నరేష్, రవికుమార్, అర్జున్ పాల్గొన్నారు.

క్లిక్ క్లిక్

భానుడు రాకముందే బతుకు పోరాటం

మంచు కురిసే వేళలో నిర్మానుష్యంగా ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాక్రేందంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే దిన చర్య ప్రారంభమైంది. పట్టణమంతా నిద్రిస్తున్న వేళా పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు మునిసిపల్ పారిశుధ్య కార్మికులు సిద్ధమయ్యారు. తాజా కూరగాయలతో చిరు వ్యాపారుల రాక మొదలైంది. దుకాణాలు తెరిచేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. ఆర్టీసీ ఉద్యోగులు బస్టాండ్‌కు చేరుకున్నారు. పేపర్ బాయ్స్ పత్రికలను సిద్ధం చేసుకున్నారు. టీ తాగేందుకు అక్కడున్న వారు టీస్టాల్ వద్దకు చేరుకున్నారు.



విధులకు హాజరవుతున్న ఆర్టీసీ సిబ్బంది



పట్టణానికి ఆకు కూరలు తెస్తూ..



ప్రపంచానికి వార్తలు పంచుతాం.. పేపర్లు సరి చేసుకుంటున్న ఏజెంట్లు



డ్యూటీ చార్ట్ రెడీ.. ఆర్టీసీ విచారణ కేంద్రం





గస్తీ తిరుగుతున్న పోలీస్ వాహనం



పట్టణాన్ని అందంగా ఉంచుతాం.. పారిశుధ్య కార్మికులు సిద్ధం



చాయ్ రెడీ



చాయ్ ఎంజాయ్



బస్టాండ్.. ప్రయాణికుల రాక కోసం ఎదురు చూపు




బతుకు బండి షురూ.. ఆటో శుభ్రం చేసుకుంటున్న డ్రైవర్





చిరు వ్యాపారులు



● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటో గ్రాఫర్ యాదాద్రి

కనగల్ వాగులో పడి రైతు మృతి

కనగల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ వాగు నీటి మడుగులో పడి రైతు మృతిచెందాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కనగల్ గ్రామానికి చెందిన రైతు చిట్టిమళ్ల పెద్దులు(54) వాగు అవతలి ఒడ్డునున్న తన పొలం వద్ద ఆరబెట్టిన ధాన్యం కుప్ప పోసేందుకు ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. పొలం నుంచి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇసుక క్వారీ గుంత నీటిలో పడి మృతిచెందాడు. చీకటి అయినా పెద్దులు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఎంత వెతికినా అతని ఆచూకీ దొరకలేదు. బుధవారం మధ్యాహ్నం అటుగా వెళ్లిన పశువుల కాపరులకు నీటిలో తేలిన మృతదేహం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. కుళ్లిన దశలో ఉన్న మృతదేహాన్ని రైతు పెద్దులుదిగా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సైదులుకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



చిట్టిమళ్ల పెద్దులు(ఫైల్)

ఇసుక క్వారీనే ప్రాణం తీసిందా?

ఇసుక క్వారీ గుంటే రైతు పెద్దులు ప్రాణాలను తీసిందని స్థానికులు వాపోతున్నారు. యంత్రాల సాయంతో అనధికారికంగా వాగులో ఇసుక తవ్వకాలు జరపగా పెద్దపెద్ద గోతులు ఏర్పడినట్టు తెలుస్తోంది. ఇటీవల కనగల్ వాగులో వరద నీరు చేరడంతో ఆ గోతులు నీటి మడుగులుగా మారాయి. ఈ నేపథ్యంలో వాగును దాటుతూ పొలం వద్దకు వెళ్లి వస్తున్న క్రమంలో పెద్దులు మడుగు నీటిలో పడిపోయి మృతిచెందాడని భావిస్తున్నారు.

ఇంట్లో చోరీ.. రూ.8లక్షలు అపహరణ

దేవరకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని హన్‌మాన్‌నగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, బాధితుడు జబ్బర్ తెలిపిన వివరాల ప్రకారం... హనుమాన్‌నగర్‌కు చెందిన జబ్బార్ పాన్‌షాపుతో పాటు చిట్టీల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల తన సొంత భూమి విక్రయించగా వచ్చిన నగదు రూ. 8లక్షలను బీరువాలో ఉంచాడు. మంగళవారం భార్యభర్తలు కలిసి పాన్‌షాపు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలు గొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ. 8లక్షల నగదు కన్పించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకట్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు జబ్బార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం

కొండమల్లేపల్లి, నవవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. మండలంలోని ఏపూర్‌తండాకు వెళ్లే దారిలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగుపై కుంకుమ చల్లి కొబ్బరికాయలు కొడుతుండగా అటుగా వెళ్తున్న వ్యక్తులు గమనించడంతో సదరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఘటనా స్థలాన్నికి వెళ్లి బ్యాగును పరిశీలించగా అందులో ఒక చీర, పూలు ఉన్నట్లు గుర్తించారు. ఆకతాయిలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు కావాలని ఇలా చేసి ఉంటారని పోలీసులు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ డి. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... ఎలాంటి అనుమతులు లేకుండా మండల పరిధిలో బుధవారం రాత్రి ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు శోభనాద్రిపురం గ్రామ శివారులోని మూసీవాగు సమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని అదే గ్రామానికి చెందిన డ్రైవర్లు పాల నరేష్, ముక్కాముల నరసింహులును విచారించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురిపై కేసు

నల్లగొండ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్న ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... వన్‌టౌన్ పరిధిలో గతంలో గంజాయి సేవిస్తున్న వారిని పట్టుకొని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా వారిలో మార్పు రాకపోగా, తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టడంతో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు సైదులు, సతీష్ నిఘా పెట్టి గంజాయి సేవిస్తున్న వారిని కోర్టుకు పంపారు. వారి తల్లిదండ్రులు తమకు ఒక అవకాశం ఇవ్వాలని కోర్టును అభ్యర్థించడంతో పాటు న్యాయస్థానం ఆదేశాల మేరకు డ్రగ్ రీహ్యాబిటేషన్ సెంటర్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

వాయిదాలకు హాజరుకాని నిందితుడికి జైలు

తిరుమలగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని జడ్జి జైలుకు పంపారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మరిపెల్లి సత్యనారాయణపై తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తుంగతుర్తి కోర్టుకు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. పోలీసులు బుధవారం అతనిని అదుపులోకి కోర్టులో తుంగతుర్తికోర్టులో జడ్జి ఎదుట హాజరుపరిచారు. జడ్జి గౌస్‌పాషా నాయిన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఇళ్ల వద్ద బైక్ కనిపిస్తే మాయమే..!

● ఖరీదైన బైక్‌లు లక్ష్యంగా చోరీలు ● బైక్‌లకు చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు ● ఒకరిపై 150 బైక్ చోరీ కేసులు

సూర్యాపేటక్రైం, నవంబరు 12,(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, దుకాణాల ముందు నిలిపి ఉంచిన ఖరీదైన బైకులను చోరీలకు చేస్తున్న ఇద్దరు నిందితులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.20లక్షల విలువైన 26 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కట్టకొమ్మగూడెం గ్రామానికి చెందిన వేమూరి క్రిష్ణ కొన్నేళ్లుగా బైక్‌లను చోరీ చేసి వాటిని ఇతరులకు విక్రయిస్తూ తద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. అందులో భాగంగా గతేడాది ఫిబ్రవరిలో మిర్యాలగూడెంలో బైకులు చోరీ చేసి అక్కడి పోలీసులకు దొరికి నల్లగొండ జైలులో సుమారు సంవత్సరం పైగా శిక్ష అనుభవించి ఈ ఏడాది మే నెలలో విడుదలయ్యాడు. అప్పటి నుంచి సూర్యాపేట, మిర్యాలగూడెం, ఖమ్మం, పట్టణాల్లో ఖరీదైన బైక్‌లను చోరీ చేస్తున్నాడు. నకిరేకల్‌లో తిరుగుతున్న సమయంలో నకిరేకల్‌లోని ఆర్లగడ్డగూడేనికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సెక్యూరిటీగార్డుగా పని చేసే రేఖల శివకుమార్ పరిచయమయ్యాడు. ఇద్దరూ కలిసి బైక్‌లు చోరీ చేస్తున్నారు. క్రిష్ణ చోరీ చేసిన పలు బైక్‌లను విక్రయించాలని శివకుమార్‌కు అప్పగించాడు. ఇలా వారు సూర్యాపేట, మిర్యాలగూడెం, ఖమ్మం పట్టణాల్లోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 26 బైక్‌లు చోరీ చేశారు. క్రిష్ణ ఒక్కడే 20 బైక్‌లు చోరీ చేశాడు. ఆరు బైక్‌లను క్రిష్ణ, శివకుమార్ ఇద్దరు కలిసి చోరీ చేశారు. చోరీ చేసిన బైక్‌ల్లో ఒక బైక్‌ను క్రిష్ణ తన వద్ద ఉంచుకుని మిగిలిన 25 బైక్‌లను విక్రయించాలని శివకుమార్‌కు అప్పగించాడు. చోరీ చేసిన బైక్‌ల్లో నాలుగు మాత్రమే శివకుమార్ విక్రయించాడు. ఒక బైక్‌లను శివకుమార్ వాడుతుండగా, మిగితా 20 బైక్‌లు శివకుమార్ ఇంటి వద్ద ఉన్నాయి. బుధవారం ఉదయం సూర్యాపేట పట్టణ పోలీసులు పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో క్రిష్ణ బైక్‌పై నకిరేకల్ వెళ్తున్నాడు. ఆపి తనిఖీ చేయగా బైక్ కాగితాలు లేవని చెప్పాడు. అనుమానంతో ఫేస్ యాప్ ద్వారా క్రిష్ణ వేలిముద్రలతో పరిశీలించగా పాత నేరస్తుడిగా నిరూపణ అయింది. వెంటనే క్రిష్ణను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేశారు. విచారణలో కొంత కాలంగా బైక్‌లు చోరీ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు అంగీకరించాడు. అతడితో పాటు నకిరేకల్‌కు చెందిన శివకుమార్ కూడా చోరీ ఘటనల్లో ఉన్నట్లు తెలిపాడు. వెంటనే పోలీసులు క్రిష్ణను వెంట తీసుకుని నకిరేకల్‌కు వెళ్లి శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని ఇంటి వద్ద 25బైక్‌లు లభించాయి. క్రిష్ణ బైక్‌లు చోరీ చేస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యతో కూడా కొన్నేళ్ల క్రితం ఘర్షణ పడి దూరంగా ఉంటున్నాడు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో క్రిష్ణపై మొత్తం 150 బైక్‌ల చోరీ కేసులు ఉన్నాయి. బైక్‌ల దొంగలను పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ వి. ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎ. వెంకటయ్య, ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ నరేందర్‌రెడ్డి, సిబ్బంది వేములకొండ శ్రీరాములు, ఎన్. వీరభద్రారెడ్డి, నరేందర్, సీహెచ్. రవికిరణ్ ఉన్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు చూపుతున్న ఎస్పీ నర్సింహ

సీలేరు టూ హైదరాబాద్

● గంజాయి అక్రమ రవాణా ● 24కిలోల గంజాయి పట్టివేత

చౌటుప్పల్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు నుంచి హైదరాబాద్‌కు కారులో గంజాయిని తరలిస్తుండగా తెలంగాణ నార్కొటిక్ బ్యూరో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద ఈ సంఘటన జరిగింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సాంబశివుడు, డ్రైవర్‌గా పనిచేసే శ్రీను, వస్తువులు డెలివరి చేసే ఓ సంస్థలో పనిచేసే యువతి ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌లో గంజాయి విక్రయిస్తుంటారు. వీరు రెండు వారాలకు ఒకసారి సీలేరుకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ముగ్గురు కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం సీలేరులో 24కిలోల గంజాయిని కిలో మూడు వేల చొప్పున కొనుగోలు చేశారు. ఎక్స్‌యూవి 700 కారులో గంజాయితో హైదరాబాద్‌కు బయలుదేరారు. ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని కారు డిక్కీ, స్టెపినీలో భద్రపరిచారు. అనుమానం రాకుండా ఉండటానికి మహిళను తీసుకెళ్లారు. పక్కా సమాచారం అందుకున్న తెలంగాణ నార్కొటిక్ బ్యూరో, స్థానిక పోలీసుల సహకారంతో పంతంగి టోల్‌గేట్ వద్ద మాటువేసి కారును అడ్డగించి పట్టుకున్నారు. 24కిలోల గంజాయి ప్యాకెట్లు, ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.2.76లక్షలు ఉంటుంది. ముగ్గురు నిందితులను అరెస్టుచేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



పొట్టకూటి కోసం వచ్చి మృత్యువాత

నిడమనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వచ్చిన ఓ వరి కోతమిషన్ యజమాని మీది నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కమంతలపహడ్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలై జిల్లా చేతపేట మండలం నాచ్చపురం గ్రామానికి చెందిన అంబలాన్ దక్షిణామూర్తి(43) తనకున్న వరి కోత మిషన్‌తో పొలాలు కోసేందుకు నిడమనూరు మండలం బొక్కమంతలపహడ్ వచ్చాడు. 10రోజులుగా అక్కడే ఉంటూ మిషన్‌తో పొలాలు కోస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి మండలంలోని బొక్కమంతలపహడ్ గ్రామంలోని ఓ రైతు పొలం కోస్తుండగా మిషన్ యజమాని దక్షిణామూర్తి ధాన్యం లోడు చేసిన ట్రాక్టర్ కింద నిద్రిస్తున్నాడు. కోతమిషన్ యజమాని ట్రాక్టర్ ట్రాలీ కింద పడుకున్న విషయం గమనించకపోవడంతో డ్రైవర్ పసుపులేటి నాగేశ్వరరావు ట్రాక్టర్‌ను ముందుకు కదిలించగా ట్రాక్టర్ దక్షిణామూర్తి తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడున్న వారు గమనించి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి సోదరుడు రంగనాథన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఉప్పు సురేష్ తెలిపారు. దక్షిణామూర్తి పదేళ్లుగా సీజన్‌లో కోతమిషన్‌తో ఇక్కడకు వచ్చి పొలాలు కోసి సీజన్ ముగియగానే సొంత రాష్ట్రానికి వెళ్లిపోయే వాడు.



అంబలాన్ దక్షిణామూర్తి(ఫైల్)

తహసీల్దార్ అవమానించారు

● మహిళ ఆరోపణ

ఆత్మకూర్(ఎస్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇంటికి ఇసుక కావాలని స్థానిక తహసీల్దార్ వద్దకు వెళ్లితే ఆఫీస్ నుంచి బయటికి వెళ్లాలని తహసీల్దార్ అవమానించారని మహిళ ఆరోపించింది. ఘటన సూర్యాపేట జిల్లా, ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో బుధవారం జరిగింది. వివరాలలోకి వెళ్లితే... మండల పరిధిలోని నసీంపేట గ్రామానికి చెందిన ఒంటరి మహిళ సామాజిక కార్యకర్త వత్సవాయి లలితకు ఒంటరి మహిళ కింద ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. పునాది లెవల్ లో పనులు అయ్యాక ఇసుక కొరత కారణంగా నిర్మాణం ఆగింది. బుధవారం ఇదిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తహసీల్దార్ ఇసుక అనుమతులు ఇస్తున్నట్లు సమాచారం తెలియడంతో స్థానిక రెవెన్యూ కార్యాలయానికి లలిత వెళ్లి ఇసుక అనుమతి కావాలని కోరినట్లు తెలిసింది. కొన్ని గ్రామాలకు ఇసుక అనుమతులు ఇచ్చి న తహసీల్దార్ నీకు అనుమతులు ఇవ్వను దిక్కు ఉన్న చోట చెప్పుకొమని అవమానపరిచినట్లు సదరు మహిళ ఆరోపించింది. కొంతమందికి అనుమతులు ఇచ్చి తనకు ఎందుకు ఇవ్వరని అడినందుకు బయటకు వెళ్లామన్నారని ఆరోపించారు.

తహసీల్దార్ వివరణ

ఒంటరి మహిళను అవమానించారని వచ్చిన ఆరోపణలపై తహసీల్దార్ అమీన్ సింగ్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లకు గతంలో జాజిరెడ్డిగూడెం నుంచి ఇసుక మీరు తెచ్చుకొలేనపుడు మళ్లీ ఇసుక అనుమతులు అని వస్తే ఎలా ఇవ్వాలని అన్నానని తెలిపారు. ఇసుక అనుమతులు ఇంకా ఎవరికీ ఇవ్వలేదని అన్నారు. తాను దుర్భషాలాడలేదని, అమమాన పర్చలేదని అన్నారు.

మద్దతు ధర పొందాలి

మర్రిగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పత్తిని తెచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని సీసీఐ సెంట్రల్ ఇన్‌చార్జి నీమ్ జై అన్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని నరంపేట గ్రామ సమీపంలో ఉన్న హరిహర కాటన్ ఆగ్రో మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి విక్రయాల కోసం వచ్చిన రైతులను ఇలాంటి నిబంధనలు షరతులు విధించకూడదని, 12 తేమ శాతం ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని ఆయన పత్తి మిల్లు యజమాన్యం, సీసీఐ సిబ్బందికి సూచించారు. పత్తి విక్రయాల విషయంలో తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మా వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



అంతర పంటతో ఆదాయం

● బొప్పాయి తోటలో బంతిసాగు ● లాభాలు గడిస్తున్న దొండపాడు రైతులు ● ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై దృష్టి

అంతర పంట సాగుతో ఆదాయం పొందుతున్నారు రైతులు. బొప్పాయి తోటలో బంతిసాగు చేసి లాభాలు గడిస్తున్నారు సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామ రైతులు. గ్రామంలో పత్తి, మిర్చి, పంటలు సాగు ఎక్కువగా చేస్తారు. రెండేళ్లుగా మిర్చికి ధర తగ్గడంతో పెరుగుతున్న పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలు కారణంగా పంట నష్టపోతుండడంతో ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై దృష్టి సారిస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి, చింతలపాలెం

గ్రామ రైతులు బొప్పాయి ప్రధాన పంటగా సాగు చేస్తూ దాని మధ్య ఖాళీ స్థలంలో అంతర పంటగా బంతి పూలతోట సాగు చేస్తున్నారు. ఈ పద్ధతి అదనపు ఆదాయాన్ని చేకూరుతుందని రైతులు అంటున్నారు. బొప్పాయిఇ పంట నాటిన తర్వాత పూర్తి దిగుబడి రావడానికి సుమారు 7 నుంచి 8 నెలల సమయం పడుతుంది. బొప్పాయి తోటలో మొక్కల మధ్య ఖాళీ స్థలం కాలపరిమితి కలిగిన బంతిపూల తోటను అంతర పంటగా సాగు చేసుకుంటే 45 రోజుల్లోనే బంతి పూలు కోతకు వస్తాయి. రైతులకు బొప్పాయి ప్రధానపంట ఆదాయంతో పాటు స్థిరమైన అదనపు ఆదాయ వనరుగా ఉంటోంది. బొప్పాయి తోటకు ఒక ఎకరంలో సంవత్సరానికి సుమారురూ.లక్ష నుంచి రూ.1.20లక్షలు, బంతికి 70 నుంచి రూ.80వేల వరకు ఆదాయం వస్తుంది. బంతిపూల నుంచి పెట్టుబడులు వెళ్లిన, బొప్పాయి, తోట నుంచి వచ్చిన ఆదాయం మిగులుతోందని కలిగిందని రైతులు అంటున్నారు.

ఎకరంలో బంతిపూల తోట సాగుచేశా



గ్రామంలో రెండు సంవత్సరాలుగా ఎకరం చేలో బొప్పాయి తోటలో అంతర సేద్యంగా బంతి తోట వేస్తున్నాను. దీంతో బంతి సాగు చేయడంతో ఎకరానికి 20 క్వింటాళ్ల వస్తుంది. కూలీల ఖర్చులు తక్కువ ఉండడంతో ఎకరానికి ఆదాయం రూ.80 వేల ఆదాయం వచ్చింది.

● గోళ్ళ రంగారెడ్డి, రైతు దొండపాడు.

నాగార్జునసాగర్ జలాల విషయంలో

సమన్వయం అవసరం

● *సాగర్ కుడికాల్వ కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు*


కాంతారావు

నార్కట్‌పల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు జలాల వాడకం విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని సాగర్ కుడికాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. బుధవారం హైద్రాబాద్ నుంచి గుంటూరుకు వెళ్తున్న ఆయన మార్గమధ్యలో నార్కట్‌పల్లి లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల రైతులు కృష్ణాజలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరదలు వచ్చిన సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు నాగార్జునసాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా ఆంధ్రా ప్రాంతానికి విడుదలయ్యే వరద జలాలను వాటా జలాలుగా లెక్కించే విధానం ఉండేది కాదన్నారు. కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత నాగార్జునసాగర్‌కు వరదలు వచ్చి దిగువకు విడుదల చేసే వరద జలాలను కూడా రాష్ట్ర వాటా జలాల కింద లెక్కిస్తున్నారని అన్నారు. ఇది సరైంది కాదని కాంతారావు అభిప్రాయపడ్డారు. ఈ కారణంగా ఏప్రి ల్ నెలాఖరున కుడికాల్వ కింద తమ రాష్ట్ర పరిధిలోని గ్రామాల రైతుల పంటల సాగుకు నీరందక నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణపై కృష్ణానది బోర్డు యాజమాన్యం (కేఆర్ఎంబీ) ఇంకా సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 60 సంవత్సరాల క్రితం ని ర్మించిన ఈ ప్రాజెక్టు భద్రత, నిర్వహణపై కేఆర్ఎంబీ ప్రత్యేక దృష్టి సారించాలని కాంతారావు అన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు శివచరణ్


శివచరణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శివచరణ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల భువనగిరిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడంతో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనంతరం శివచరణ్‌ను అభినందించారు. శివచరణ్ పదో తరగతి చదువుతున్నాడు. కార్యక్రమంలో పీడీ పంగ సైదులు, నామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు రావులపెంట వెంకటయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు

నాగార్జునసాగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న బీసీ గురుకులాల జిల్లా స్థాయి క్రీడా పోటీలు బుధవారం రెండో రోజు హోరాహోరీగా కొనసాగాయి. సెమీ ఫైనల్స్‌లో ఖో-ఖో పోటీల్లో నార్కట్‌పల్లి-నాగార్జునసాగర్ జట్లు, కబడ్డీలో తిరుమలగిరి(సాగర్)-నాగార్జునసాగర్ జట్లు, వాలీబాల్‌లో రాజాపేట-నాగార్జునసాగర్ జట్లు తలపడినట్లు ప్రిన్సిపాల్ రవి కుమార్ తెలిపారు. అథ్లెటిక్స్ అండర్-19 పోటీల్లో 200 మీటర్ల పరుగుపందెంలో కె.అకాష్ (కోల్‌ముంతలపహాడ్) ప్రథమస్థానం, కె.శివ (పోచంపల్లి) ద్వితీయ స్థానం, 800 మీటర్ల పరుగుపందెంలో భాషంత్ (పోచంపల్లి) ప్రథమ స్థానం, బి. రవికుమార్ (పోచంపల్లి) ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం(నేటి)తో పోటీలు ముగియనున్నట్లు ఆయన తెలిపారు.

నాణ్యమైన విత్తనాలే రైతులకు నిజమైన నేస్తాలు


రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ అంజయ్య

నేరేడుగొమ్ము, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలే రైతులకు నిజమైన నేస్తాలు అని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ అంజయ్య అన్నారు. నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కేతేపల్లి గ్రామంలో రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతులు కేఎన్ఎం 1638 వరి సాగు చేయడంతో గతం కంటే అధిక దిగుబడిని ఇచ్చేలా పంట పండిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ ఈ విత్తనాలను పక్క రైతులకు అందించి విత్తనోత్పత్తికి సహకరించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేష్, రాజు, రైతులురాములు, గుర్రం శ్రీను, నారాయణ, యాద అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మిథ్యగా మారిన వృత్తి విద్య

● **కోర్సులు మంజూరు చేసి పోస్టులివ్వని ప్రభుత్వం**

● **రెండేళ్లు స్వచ్ఛందంగా బోధించిన వలంటీర్లు**

● **నష్టపోతున్న ఒకేషనల్ విద్యార్థులు**

● **నార్కట్‌పల్లి ప్రభుత్వ కళాశాలలో ఇదీ పరిస్థితి**


నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో (జీజేసీ)లో వృత్తి విద్య మిథ్యగా మారింది. పాఠాలు బోధించే అధ్యాపకులు అర్ధాంతరంగా మానివేయడంతో బోధించే వారు లేక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు జూనియర్ కాలేజీలో రెగ్యులర్ కోర్సులైన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలకు అధ్యాపకులను నియమించిన ప్రభుత్వం ఒకేషనల్ కోర్సులకు పోస్టులు మంజూరు చేయలేదు. పైగా ఒకేషనల్ విద్యార్థులకు ఇంతకాలం వలంటీర్లుగా విద్యను బోధించిన అధ్యాపకులు అర్ధాంతరంగా మానేయడంతో ఒకేషనల్ విద్యార్థుల చదువు త్రిశంకు స్వర్గంలా మారింది. అటు చదవలేక ఇంకో కాలేజీకి వెళ్లలేక విద్యార్థులు సతమతమవుతున్నారు. చివరకు కామర్స్ చెప్పే అధ్యాపకులే తప్పనిసరై ఎంఎల్‌టీ క్లాసులు చెబుతున్న వింత పరిస్థితి నెలకొంది.

కోర్సులే మంజూరు - పోస్టులు కాదు

నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వం 2023-24 విద్యా సంవత్సరానికి జూనియర్ కాలేజీని మంజూరు చేసింది. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులను మంజూరు చేసింది. అయితే అదే విద్యాసంవత్సరానికి నాంపల్లి మండల కేంద్రంలోని ఒకేషనల్ కాలేజీని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి బదలాయించారు. ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులను బోధించేందుకు అనుమతిచ్చారు. దీంతో కాలేజీలో ప్రస్తుతం 70మంది విద్యార్థులు ఒకేషనల్ కోర్సుల్లో ఉన్నారు. అయితే కోర్సులైతే మంజూరు చేసిన ప్రభుత్వం అధ్యాపక పోస్టులను మాత్రం మంజూరు చేయలేదు.

రెండేళ్లు బోధించిన వలంటీర్లు

కాలేజీకి కోర్సుల నిర్వహణకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, అధికారులు కనీసం కాంట్రాక్టు లెక్చరర్ పోస్టులనైనా మంజూరు చేయకపోతారా అనే విశ్వాసంతో నల్లగొండకు చెందిన సరస్వతి, యామిని అనే ఇద్దరు యువతులు ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులను బోధించేందుకు వలంటీర్‌గా ముందుకు వచ్చారు. సుమారు రెండేళ్లు ఎలాంటి వేతనం లేకుండానే స్వచ్ఛందంగా వృత్తి విద్య బోధన చేశారు. రెండేళ్లు గడిచినా ప్రభుత్వం కాలేజీకి వృత్తి విద్యా కోర్సుల బోధనకు పోస్టులను మంజూరు చేయకపోవడం, చేస్తారనే నమ్మకం కూడా లేకపోవడంతో సెప్టెంబరు నెల నుంచి అర్ధాంతరంగా మానేశారు. దీంతో కాలేజీలో చేరిన సుమారు 70 మంది వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్మీడియట్ కోర్సులను బోధించే కామర్స్ లెక్చరర్ ఇతర బైపీసీ సబ్జెక్టులు బోధించే వారితో అడపాదడపా క్లాసులను నడుపుతున్నారు.

మాకు నష్టం జరగకుండా చూడాలి



కాలేజీలో అధ్యాపకులు ఉన్నారనే నమ్మకంతో ఒకేషనల్ కోర్సులో చేరాం. మొదటి సంవత్సరం వరకు బోధించిన అధ్యాపకురాలు ఈ విద్యాసంవత్సరం ప్రా రంభమైన తర్వాత మధ్య లో మానేసింది. ప్రభుత్వం కోర్సులు మంజూరు చేసింది కానీ పోస్టులు మంజూరు చేయలేదంటూ కాలేజీ అధ్యాపకవర్గం చెబుతోంది. మాకు వృత్తి విద్యాభ్యాసం విషయంలో నష్టం జరగకుండా న్యాయం చేయాలి.

- కొండా సతీష్, ఎంఎల్‌టీ స్టూడెంట్, ద్వితీయ సంవత్సరం

వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్లు తీసుకోం



నార్కట్‌పల్లి జీజేసీకి వృత్తి విద్యా బోధకుల పోస్టులను మంజూరు చేయాలని ఇప్పటికే పలు పర్యాయాలు డీఐవోతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌ను, ప్రత్యేకాధికారిని కోరాం. అయినా ఇప్పటికీ పోస్టులు మంజూరు కాలేదు. కనీసం ఈ విద్యా సంవత్సరం ఉన్న విద్యార్థులకైనా అన్యాయం జరగకుండా కాలేజీ లెక్చరర్‌ల ద్వారా బోధన చేయిస్తున్నాం. అధ్యాపక పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయకుంటే వచ్చే విద్యా సంవత్సరం నుంచి మా కాలేజీలో అడ్మిషన్లు ఆపేస్తాం.

- బాలాజీ, ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ), నార్కట్‌పల్లి

587.60 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌కు ఎగువనుంచి 34,468 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, 37,779 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు)కాగా బుధవారం సాయంత్రానికి 587.60 అడుగులుగా (305.8626టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20,625క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 5,654 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక

సంస్థాన్ నారాయణపురం నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. పదో తరగతికి చెందిన డి.శిరీష 100 మీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది.. 200 మీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో నీళ్ల అమ్ములు ఎంపికైంది. ఇరువురు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఈ విద్యార్థినులు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు కళావతిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేగట్టె రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


ప్రాకార మండపంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రాకార మండపంలో ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. గజవాహనంలో విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టి అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,66,297 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. ఆధ్యాత్మికవాడల్లో 448 జంటలు సత్యదేవుని వ్రతాలు జరిపించగా అధిక సంఖ్యలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

స్వామిని దర్శించుకున్న స.హ.చట్టం కమిషనర్లు

స్వామివారిని సమాచార హక్కు చట్టం కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్, భూపాల్, బోరెడ్డి ఆయోధ్యరెడ్డి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు దేవస్థాన అతిథిగృహం చేరుకున్న కమిషనర్లకు కలెక్టర్ ఎం.హనుమంతరావు అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డితో కలిసి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. తూర్పురాజగోపురం ద్వార ఆలయ ప్రవేశించిన కమిషనర్లు ముందుగా క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకోగా ప్రధానార్చక భట్టర్ సురేంద్రాచార్యులు బృందం పూలమాలలతో స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి మొక్కులు తీర్చుకొని గర్భాల యంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు.

దేవాదాయ శాఖకు స.హ.చట్టం వర్తిస్తుంది

ప్రభుత్వం ద్వారా వినియోగం అవుతోన్న స.హ.చట్టం దేవాదాయ శాఖకు వర్తిస్తుందని ఆర్టీఐ కమిషనర్లు పీ.వీ.శ్రీనివాసరావు, బోరెడ్డి ఆయోధ్యరెడ్డి, దేశాల భూపాల్ అన్నారు. యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్న అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వెలువడిన తీర్పులనే ఆలయాల్లో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఆదేశాలు అమలు చేయకుండా ఇటీవల సుప్రీం కోర్టు మార్గదర్శకాలను దేవాదాయశాఖ అమలు చేయాలన్నారు. స.హ. చట్టం అమలులో టీటీడీకి కూడా మినహాయింపు లేదని కోర్టు వెల్లడించినట్లు వివరించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కూడా దేవాదాయ శాఖకు స.హ. చట్టం వర్తిస్తుందన్నారు. గతంలోని తీర్పును అధికారులు అమలు చేయలేదని, అది చట్టానికి వాస్తవ విరుద్ధమని వారు పేర్కొన్నారు.


స.హచట్టం కమిషనర్లకు ఆశీర్వచనం చేస్తున్న ప్రధానార్చకుడు సురేంద్రాచార్యులు

లాంచీ ప్రయాణికులకు సౌకర్యవంతంగా..

● *రూ.4 కోట్ల ఐడబ్ల్యూఏఐ నిధులతో సాగర్‌లో పంటు తయారీ*

● *రెండు సాగర్‌కు, ఒకటి సోమశిల బోటింగ్ పాయింట్‌కు*


హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ వద్ద తయారు చేస్తున్న పంటు

నాగార్జునసాగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లో పర్యాటకపరంగా సౌకర్యాలు మరింతగా మెరుగుపడనున్నాయి. సాగర్ హిల్‌కాలనీలో ఉన్న పర్యాటక శాఖ లాంచీ స్టేషన్‌కు కొత్త పంటులు(లాంచీ ఎక్కేందుకు పక్కన నిలిపి ఉంచే ఏర్పాట్లు) రానున్నాయి. దీంతో పర్యాటకులకు లాంచీలు ఎక్కడానికి, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండ వద్ద లాంచీలు దిగడానికి పర్యాటకులకు మరింత సౌకర్యం కలుగనుంది. ఇప్పటికే సాగర్ లాంచీస్టేషన్‌లో మూడు పంట్లు ఉండగా, ఒక్కొక్కటి 18అడుగుల పొడవు ఉంది. కొత్తగా తయారుచేస్తున్న పంట్లు 24అడుగుల పొడవుతో రూపొందిస్తున్నారు. సాగర్ లాంచీస్టేషన్ వద్ద ప్రస్తుతం మూడు పంటులను తయారు చేస్తుండగా, రెండు సాగర్ బోటింగ్‌కు, మరొకటి సోమశిల బోటింగ్ పాయింట్‌కు కేటాయించినట్లు పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐడబ్ల్యూఏఐ(ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా) రూ.4కోట్లతో వీటిని తయారుచేస్తోందని అధికారులు వెల్లడించారు. కోల్‌కత్తాకు చెందిన బ్లూ వేల్ షిపింగ్ సంస్థ ఈ పనులు చేపట్టగా, మూడు నెలల్లో పూర్తి చేసి పర్యాటక శాఖకు అందజేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఐడబ్ల్యూఏఐ పనితీరు ఇలా..

కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఇన్‌లాండ్ వాటర్‌వేవ్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) 1986లో ఏర్పాటైంది. లోతట్టు జలమార్గాలపై షిప్పింగ్, నావిగేషన్‌ను ప్రోత్సహించడం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. ఈ సంస్థ అంతర్గత జలమార్గాలకు మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతుంది.

చెర్వుగట్టులో ఆలయశుద్ధికి శ్రీకారం

● *ప్రతీ గురువారం ఇక స్వచ్ఛతా కార్యక్రమం*


చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న ఈవో మోహన్‌బాబు

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మనగుడి- స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఇక ప్రతీ గురువారం దేవస్థానంలో ఆలయ శుద్ధికి శ్రీకారం చుడుతున్నామని మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్‌బాబు అన్నారు. బుధవారం దేవస్థాన సిబ్బందితో మన గుడి-స్వచ్ఛత పరిశుభ్రత అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుట్టపైన, గుట్ట కింద అపరిశుభ్రంగా ఉన్న పరిసరాల్లోని వ్యర్థ పదార్థాలను శుభ్రపర్చారు. పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు దేవస్థానం సిబ్బందికి భక్తులు సహకరించాలని ఈవో కోరారు. ప్రతీ గురువారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి పర్యవేక్షిస్తారని చెప్పారు.

ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

● **విధుల పట్ల నిర్లక్ష్యం చేసినందుకు చర్యలు**

మర్రిగూడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల జాబ్ కార్డులో ఈకేవైసీ ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయకుండా నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో మున్నయ్య తెలిపిన ప్రకారం ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు శివన్నగూడ పుష్పలత, రామ్ రెడ్డిపల్లి యాదయ్యచారి, అజిలాపురం నరసింహులు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు ఈకేవైసీ యాప్‌లో కూలీల జాబ్‌కార్డులు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు ఆయన తెలిపారు. కూలీలకు సంబంధించిన వివరాలను అక్టోబరు 23 వరకు కేవలం 16శాతం మాత్రమే ఆన్‌లైన్‌లో అతి తక్కువ నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం మర్రిగూడ మండలంలోని సస్పెండ్ నోటీసు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు జారీ చేసిన సస్పెండ్ నోటీస్ డీఆర్‌డీఏ ఆఫీసుకు వచ్చి సమాధానం చెప్పాలని జారీ చేసిన నోటీసులో వెల్లడించినట్లు ఎంపీడీవో తెలిపారు.

కృష్ణా జలాలు అందాయా.. ఆలోచించండి

● *సమస్యలు తెలుసుకోవడానికే జాగృతి జనం బాట*

● *జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో పరిస్థితులు దయనీయం*

● *తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత*



ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నల్లగొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ తెచ్చుకున్నామని, తెలంగాణ వచ్చాక మన నీళ్లు మనకు వస్తాయని అనుకున్నామని, అయితే జిల్లాకు కృష్ణా నీళ్లు పూర్తి స్థాయిలో వచ్చాయో లేదో అందరూ ఆలోచించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో వివిధ వర్గాల ప్రజలతో సమావేశం నిర్వహించి జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సాగర్ డ్యాం ఇక్కడే ఉన్నా చుట్టూ ఉన్న 5 మండలాలకు నీళ్లు రావన్నారు. బీఆర్ఎస్‌ను ఇదే విషయంలో విమర్శించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఎందుకు పనులు చేపట్టడం లేదని ఆమె ప్రశ్నించారు.

నల్లగొండ చరిత్ర కలిగిన ప్రాంతం

నల్లగొండ జిల్లా అంటేనే ఎంతో చరిత్ర కలిగిన ప్రాంతమని, రాజ్యాలు, ప్రజా ఉద్యమాలు, ఆలోచనలు ఉన్న జిల్లా అని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒకప్పుడు బౌద్ధం, జైనంతో పాటు అ ద్భుతమైన ఆలోచన సరళి కలిగి ఉందన్నారు. జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్రను కాపాడుకునే ప్రయత్నం జరుగుతుందన్నారు. పచ్చల, ఛాయ సోమేశ్వరాలయాలు ఉన్నాయని, మరో పక్క సాయుధ రైతాంగం పోరాటం జరిగిందన్నారు. సాయుధ రైతాంగ పోరాటం చేయని ఇళ్లు లేదని, జిల్లాలో ఇప్పటికి కూడా అదే చైతన్యం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రతీ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు తిరిగానని గుర్తుచేశారు. ప్రతీ మండల కేంద్రంలో బతుకమ్మను ఎత్తుకొని తిరిగానని, అలాంటి ఈ జిల్లాకు ప్రస్తుతం జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా వచ్చానని చెప్పారు. అనంతరం జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కోరారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించిన సందర్భంగా రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మెటర్నరీ వార్డులో ఒక్కొక్క బెడ్ మీద ఇద్దరు పేషెంట్లను పడుకోబెట్టారని, సౌకర్యాలు లేకపోయిన పనిచేస్తున్న డాక్టర్లు, నర్సులకు చేతులెత్తి నమస్కరిస్తున్నానన్నారు. ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ, వాచ్‌మన్, దోబీలు, పేషెంట్ కేర్ సిబ్బంది ఇబ్బందులో ఉన్నారని వారికి నెలకు రూ.16వేలు రావాల్సి ఉండగా ఏజెన్సీలు కోత పెట్టి రూ.11వేలు ఇస్తున్నారన్నారు. జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీసం 1లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయలేదని, బోనస్ తప్పించుకునేందుకు రైతుల నుంచి ధాన్యం కొనడం లేదని ఆరోపించారు. తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండలో కనీసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి తక్షణమే అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై దృష్టి సారించాలని కోరారు.

ఫ్లెక్సీలు చించడం ఎంత వరకు సమంజసం

జాగృతి కార్యకర్తలు జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వాటిని చించివేయడంతో పాటు తొలగించి ఫ్లెక్సీలు పెట్టిన వారిని అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. మంత్రి వెంకట్‌రెడ్డితో తనకు ఎలాంటి పంచాయితీ లేదని పోలీసులకు చెప్పి తమ కార్యకర్తలను వదిలివేయించాలని కోరారు. తాను రాజకీయాలు చేయాలని రాలేదని, రాజకీయాలు చేసే సమయం వస్తే ఖచ్చితంగా రాజకీయాలు చేయడంతో పాటు జిల్లాలో గట్టి పోటీదారులను నిలబెడతానని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆమె వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కనగల్: కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. అర్చకులు కవితకు వేదఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

నార్కట్‌పల్లి: 'నేస్తం' స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలు, అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నార్కట్‌పల్లిలోని నేస్తం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు టీజీ లింగంగౌడ్ నివాసానికి ఆమె వచ్చారు. సంస్థ ద్వారా చేసిన సేవా కార్యక్రమాల ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆమె ఆసక్తిగా తిలకించారు.

అంతర్జాతీయ సమావేశానికి జిల్లా యంత్రాంగానికి ఆహ్వానం

నల్లగొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో నిర్వహించే సైన్స్ అండ్ టెక్నాలజీ అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లా యంత్రాంగానికి ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఈమెయిల్ ద్వారా ఆహ్వానం పంపారు. డిసెంబరు 4వ, 5వ తేదీల్లో అంతర్జాతీయ సమావేశం నిర్వహించనున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీని సామాజిక సేవ పరిష్కారంలో ఉపయోగించడం క్లస్టర్ల ద్వారా అభివృద్ధి చేసిన విజయవంతమైన నమూనాలు ప్రదర్శిస్తారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన ప్రభుత్వాధికారులు, అకాడమిక్‌లు, పరిశ్రమల నిపుణులు పాల్గొననున్నారు.

16న కార్తీక వన భోజనాలు

మోతె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోదాడలో ఈ 16న నిర్వహించే కార్తీక వన భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ నాయకుడు నలజాల శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండలంలోని అన్నారిగూడెం, సర్వారం గ్రామాల్లో ఆహ్వాన పత్రికలు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాతులూరి హన్మంతరావు, పోటు కోటేశ్వరరావు, రావెళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతాలు

సూర్యాపేట టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాత బస్‌స్టేషన్‌సమీపంలోని సాయిబాబా దేవాలయంలో బుధవారం అనఘాష్టమి వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక బహుళ అష్టమి విష్ణుమూర్తికి చాలా విశిష్టమైందన్నారు.ఈ మాసంలో అనఘాదేవి సమేత అనఘాస్వామికి వ్రతాలు చేశామన్నారు. ఈ వ్రతంతో సకల శుభాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఈ రోడ్డును పట్టించుకోరూ..


అధ్వానంగా నెమ్మికల్ - పాత సూర్యాపేట రోడ్డు

ఆత్మకూర్(ఎస్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత సూర్యాపేట- నెమ్మికల్ రోడ్డు అధ్వానంగా మారింది. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. గ్రామాల మధ్య లింకు రోడ్లను టీడీపీ ప్రభుత్వం హయాంలో జన్మభూమి పథకం ద్వారా మరమ్మతులు చేశారు. ఆ తర్వాత ఈ రోడ్లను ఎవరూ పట్టించుకోనందున రూపురేఖలే కోల్పోయాయి. కొద్దిపాటి వర్షాలు వచ్చినా పక్క గ్రామానికి వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ నుంచి పాత సూర్యాపేటకు వేళ్లే రోడ్డు కాలినడకకే కష్టంగా మారింది. రెండు కిలోమీటర్ల మేర ఈ రోడ్డుకు మరమ్మతు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెమ్మికల్ గ్రామస్థులు పాత సూర్యాపేట వెళ్లాలంటే ఆరు కిలోమీటర్లు అదనపు దూరం వెళ్లాల్సి వస్తోంది. ఈ గ్రామాల మధ్య రైతులు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులో కనీసం గ్రావెల్ పోసినా నడిచి వెళ్లడానికైనా వీలుంటుందని స్థానికులు చెబుతున్నారు ఈ రోడ్డుకు వెంటనే ప్రభుత్వం మరమ్మతులు చేయించి రెండు గ్రామాల మధ్య సంబంధాలు మెరుగుపర్చాలని కోరుతున్నారు.

సిరికొండ వీబీకే ఎన్నికకు పోటాపోటీ

● ఓటరు జాబితాలో తప్పులతో ఈ నెల 7న జరగాల్సిన ఎన్నిక వాయిదా
● పోటీపోటీ ప్రచారంతో సర్పంచ్ ఎన్నికలను తలపిస్తున్న తీరు

మోతె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ మహిళా సంఘాల వీబీకే(విలేజ్ బుక్ కీపర్)పోస్టుకు ఈ నెల 7న ఎన్నిక జరగాల్సి ఉంది. మహిళా సంఘాలు 29 ఉండగా, ఓట్లు 29మంది మాత్రమే ఉంటాయి. ఈ ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో పెట్టారు. ఈ నెల ఏడో తేదీన ఎన్నిక జరగాల్సి ఉంది. ఓటరు జాబితాపై స్థానికులు అభ్యంతరం చెప్పడంతో ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. తప్పుడు ఓటరు జాబితా అధికారులకు తెలిసే జరిగిందని గ్రామస్థులతో పాటు పలు సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. వీబీకే రేసులో ఐదుగురు ఉండగా, అధికార పార్టీకి చెందినవారు ఇద్దరు ఉన్నారు. ఆ ఇద్దరు జనాదరణ ఉన్న నాయకులతో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల ఇంటికి వెళ్లి తమకు మద్దతు పలకాలని అభ్యర్థిస్తున్నారు. ఈ ఎన్నిక ప్రారంభమైనప్పటి నుంచి పంచాయతీ ఎన్నికను తలపిస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. సిరికొండ సమస్యాత్మక గ్రామమైనందున ఘర్షణలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికల వాయిదాపడడంతో పొదుపు సంఘాల నుంచి గతంలో తొలగించిన సభ్యులు, తమకూ ఓటు హక్కు కల్పించాలని కోరుతున్నారు. సంఘానికి ఉన్న బకాయిలు చెల్లించి ఎన్నికల్లో నిలబడాలని తొలగించిన సభ్యులు ఆరాటపడుతున్నారు. తమ వర్గం వారిని ఒక తాటిపైకి తీసుకురావడానికి రాజకీయ నాయకులు యత్నిస్తున్నారు. ఈ ఎన్నికను ఈ నెల 13న నిర్వహిస్తామని ఏపీఎం మంజుల తెలిపారు. 29 మంది ఓటరులో జాబితాలో లీడర్లు కాకుండా, రెండో సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నందున ఎన్నికను వాయిదా వేశామన్నారు. బ్యాంకులో సంఘాలకు సంబంధించిన లీడర్లను గుర్తించి వారిని ఓటరుగా నమోదు చేసి ఎన్నికను నిర్వహిస్తామన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే

● రోడ్ల పక్కనే బావులు, చెరువులు
● భయాందోళనలో ప్రజలు


గోరెంట్ల గ్రామంలో ప్రమాదకరంగా రహదారి పక్కనే బావి

మద్దిరాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రోడ్ల పక్కను బావులు, చెరువులు ఉన్నందున ప్రమాదం పొంచి ఉంది. మూలమలుపుల్లో ఉన్న బావులు, చెరువులను సమీపానికి వచ్చే వరకు గుర్తించనందున భారీ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఎక్కువగా రహదారుల వెంబడే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారుల నుంచి విద్యార్థులను ఆటోల్లో ప్రైవేట్ విద్యా సంస్థలకు, అదేవిధంగా కూలీలను పంట పొలాలకు తరలిస్తున్నారు. మద్దిరాల మండలంలోని గోరెంట్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో మూలమలుపు వద్ద బావి ఉంది. బావికి ఎటువంటి రక్షణ లేదు. కనీసం సూచిక బోర్డు కకూడా లేనందున ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిలో సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి హైదాబాద్ వెళ్లే బస్సు రాకపోకలు సాగిస్తోంది. అదేవిధంగా మద్దిరాల- ముకుందాపురం గ్రామాల మధ్య రహదారికి పక్కనే చెరువు ఉండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. చెరువు కట్ట చిన్నగా ఉన్నందున ఎదురుగా వచ్చే వాహనాలు తొలగడానికి అవకాశం లేదు. దీంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ కూడా సూచిక బోర్డు, రక్షణ గోడలా అధికారులు స్పందించి ప్రమాదకర ప్రాంతాల్లో సూచిక బోర్డులు, రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి

మండలంలో అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటల కట్టలపై రహదారులు నిర్మించారు. వాటిపై రక్షణ గోడలు ఏర్పాటు చేయడంతో పాటు సూచిక బోర్డులు పెట్టాలి. మూలమలుపుల వద్ద రక్షణ గోడ ఏర్పాటు చేయాలి.

● భిక్షునాయక్, ప్రయాణికుడు

రాష్ట్ర స్థాయికి పలువురు విద్యార్థుల ఎంపిక

ఆత్మకూర్(ఎస్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూర్(ఎస్) మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని వి.సుప్రియ, సూర్యాపేటలో జరిగిన అండర్-17 విభాగం డిస్కస్‌త్రోలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. దీంతో ఆమె రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. సుప్రియను మోడల్ స్కూల్ అదనపు సంచాలకుడు శ్రీనివాసాచారి అభినందించారు.

● అర్వపల్లి: ఎస్‌జీఎఫ్ అండర్-14 అథ్లెటిక్స్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో జరిగిన హైజంప్ విభాగంలో నోముల షైనీ మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో బాలునాయక్ తెలిపారు. జాజిరెడ్డిగూడెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి చదువుతున్న నోముల షైనీ రాష్ట్ర స్థాయిలో సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరిగే అథ్లెటిక్‌లో పాల్గొంటుందని తెలిపారు. షైనీని హెచ్‌ఎం సైదులు, ఉపాధ్యాయులు పురుషోత్తం, సంపత్, రమేష్, శంకర్, కిశోర్ అభినందించారు.

● కోదాడ రూరల్: రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు మండలంలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. భువనగిరిలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల చదరంగం పోటీల్లో తేజ విద్యాలయంకు చెందిన భూక్య యోగిత (6వ తరగతి), ఓరుగంటి అనంతలక్ష్మి (7వ తరగతి) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు.

● హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి సీహెచ్ నితిన్ రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ దున్నా వెంకటేశ్వర్లు, పీడీ ఆంజనేయులు, పీఈటీ రాములు తెలిపారు. ఈ నెల 11న ఉమ్మడి జిల్లా స్థాయిలో 100, 200 మీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో నితిన్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడని, . సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈనెల 14న నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.కాగాఉత్తమ ప్రతిభ కనబర్చిన నితిన్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు బుధవారం గురుకుల పాఠశాలలో అభినందించారు.

మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం


సింగరేణిపల్లిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మండల అధికారులు

మోతె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ నుంచి మోతె మండలంలోని సింగరేణిపల్లి టోల్‌ప్లాజా వద్ద ఉన్న హెలీప్యాడ్‌లో దిగారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఖమ్మం జిల్లాకు వెళుతున్న మంత్రికి సూర్యాపేట ఇన్‌చార్జి ఆర్డీవో కృష్ణయ్య, మోతె తహసీల్దార్ ఎం.వెంకన్నతో పాటు మండల వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. రెవెన్యూ సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారన అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాటాలు చేయాలి

హుజూర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాటాలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసు, జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో, మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఇందిరాల వెంకటేశ్వర్లు, వెంకన్న, రాము, శ్రీను, సన్నగండ్ల చిన్నజాను, కె.నాగమణి, వెంకటేశ్వర్లు, సామ్యేల్, మోష, ఏసు, చెంచయ్య, రంగరాజు, పాల్గొన్నారు.

శివయ్య దర్శనానికి పాదయాత్ర

మేళ్లచెర్వు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామిఆలయాన్ని శివ కేశవ భక్తి మండలి ఆధ్వర్యంలో 150 మంది శివ భక్తులు, అయ్యప్ప భక్తులు బుధవారం దర్శించుకున్నారు. కోదాడలో శ్రీకోదండ రామాలయం నుంచి తిరుపతి సుబ్రహ్మణేశ్వరశర్మ, ఆకుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహా పాదయాత్రగా బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు ఆలయానికి వచ్చారు. భక్తులకు ఆలయ పాలకమండలి సభ్యులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతంర ఆలయ ప్రాంగణంలో భజనలు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పాదయాత్ర భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఆలయ ఈవో ఎన్. శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్థన్‌శర్మ, స్థానిక మండల సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెండేళ్లుగా ప్రహసనం

(5వ పేజీ తరువాయి)

దృష్టి సారించకపోవడంతో ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి

సన్నబియ్యం మంజూరుతో అక్రమాలకు చెక్

గతంలో ప్రభుత్వం రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నప్పటికీ పక్కదారి పట్టేది. రేషన్ పక్కదారి పట్టకుండా ఉండాలనే సంకల్పంతో పాటు ప్రజలకు సన్నబియ్యం సరఫరా చేయాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం అందజేస్తోంది. రేషన్‌కార్డుపై ప్రతి ఒక్కరికీ 12కిలోల సన్నబియ్యం అందజేస్తోంది. గతంలో కన్నా భిన్నంగా సన్నబియ్యం పంపిణీతో రేషన్‌బియ్యం అర్హులైన ప్రతి ఒక్కరూ తీసుకుంటున్నారు. దళారులకు విక్రయించే వారు పూర్తిగా తగ్గిపోయారు. దీంతో అక్రమాలకు తావులేకుండాపోయింది.

ఈకేవైసీకి లబ్ధిదారులు సహకరించాలి

ప్రభుత్వాల సూచన మేరకు ఈ-కేవైసీసీ త్వరలో పూర్తి చేస్తాం. ఈ ప్రక్రియ పూర్తయితే బోగస్ రేషన్‌కార్డులకు చెక్ పడే అవకాశం ఉంది. చనిపోయిన వారి వివరాలను తొలగించే అవకాశం ఈకేవైసీతో సాధ్యం. ఇందుకు ప్రజలు సహకరించాలి. ఇప్పటికే ఈ-కేవైసీ దాదాపు పూర్తి కావచ్చింది.

● మోహన్‌బాబు, డీఎస్‌వో

ముక్త్యాలబ్రాంచ్ కెనాల్ ద్వారా నీరందిస్తాం


పాలకవీడు మండలం బెట్టెతండాలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

పాలకవీడు, మేళ్లచెర్వు, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో రూ. 18 కోట్లతో ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు చేపట్టామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖా మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం మునివడ్డుసింగారం, యల్లాపూరం, బెట్టితండా రూ.9 కోట్లతో అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు.జవహర్ జాన్‌పహాడ్‌ఎత్తిపోతల పథకం సామర్థ్యం మరింతగా పెంచి జాన్‌పహాడ్ చెర్వును నింపేందుకు పథకాన్ని సిద్ధం చేశామన్నారు. దీంతో జాన్‌పహాడ్ పరిపస ప్రాంత ప్రజలు త్రాగు, సాగు నీరు అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నర్సింహా, ఆర్డీవో శ్రీనివాసులు, సీఐ చరమందరాజు, ఎస్ఐ కోటేష్, కాంగ్రెస్ నాయకులు మాజీ జడ్పీటీసీ మోతీలాల్, సుబ్బారావు, గోపాల్, జితెందర్‌రెడ్డి, నర్సింహారావు, శేషు రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● ముక్త్యాల కెనాల్ ద్వారా రైతులకు ఏడాది పొడవునా సాగునీరందిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మేళ్లచెర్వు మండల కేంద్రంలో రూ.3కోట్లతో నాలుగు లేన్లగా విస్తరించిన ప్రధాన రహదారిని ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌ఎస్పీ కాలువపై మండల కేంద్రంలో నిర్మించిన వంతెనలకు వచ్చే మహా శివరాత్రి నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో రూ.కోటితో నిర్మించే షాదీఖానాకు స్థలాన్ని ఎంపిక చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఈఈ సీతారామయ్య, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

సూర్యాపేటటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో ఈనెల 14వతేదీ నుండి జరిగే జిల్లా గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 14వతేదీ నుండి 20వతేదీ వరకు 58వజాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వారోత్సవాల్లో భాగంగా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బి. బాలమ్మ, వడ్డె శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు

దళారుల చేతుల్లో మోసపోతున్న మత్స్యకారులు

గరిడేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దళారుల చేతుల్లో మత్స్యకారులు మోసపోతున్నారని, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు జోగు అరవిందరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయడంతో వాటిని మత్స్యకారులు పట్టుకుని గిట్టుబాటు ధరకు విక్రయించి జీవనం సాగించేవారని, కానీ ఇప్పుడు కాంట్రాక్టర్లు, ఆంధ్రా నుంచి జాలర్లకు తీసుకువచ్చి వారితో చేపలు పట్టిస్తూ స్థానిక మత్స్యకారులు జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు లీజు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా కాంట్రాక్టర్లు జిల్లా మత్స్యశాఖ అధికారులను మచ్చిక చేసుకుని, లీజు చెల్లించకుండా, అవసరానికి కొద్దిపాటి లీజు చెల్లిస్తూ ఫిషింగ్ ఆర్డర్ తీసుకొచ్చి చేపలు పట్టించి చేతులు దులుపుకుంటున్నందున లీజు బకాయి పెరిగిపోతుందన్నారు. ఈ విధానంతో మత్స్యకారులపై భారం పడి అధిక నష్టం జరుగుతోందని అన్నారు.

మృతి చెందిన మత్స్యకారుల స్థానంలో వారి వారసులను తీసుకుని సభ్యత్వాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా కాంట్రాక్టు వ్యవస్థను తొలగించి చేప పిల్లలను ఉచితంగా అందించి మత్స్యకారులే వాటిని పట్టుకొనే విధంగా అవకాశం కల్పించాలన్నారు.

జిల్లాలో త్వరలో భూసర్వే

(5వ పేజీ తరువాయి)

నెంబరులోని మొత్తం భూముల రైతులకు సంబంధించి భాగాల వారీగా సర్వే చేసే వారు కాదు. కానీ ప్రస్తుతం చేయబోయే సర్వేలో మాత్రం రైతుల భూముల వారీగా సర్వే చేయనున్నారు. సర్వే అనంతరం రైతుల భూములకు హద్దులు ఏర్పాటు చేయనున్నారు. అక్షంశాలు, రేఖాంశాల ఆధారంగా సంబంధిత భూముల వివరాలను భూభారతి చట్టం వెబ్‌సైట్‌లో నమోదు చేయనున్నారు. అనంతరం భూదార్ నెంబరును కేటాయిస్తారు. దీంతో ఎవరైనా ఈ నెంబరుతో నేరుగా సంబంధిత భూమి వద్దకు వెళ్లే అవకాశం ఉంది. భూముల సర్వే విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

ఏళ్ల తరబడి సమస్యలకు చెక్

గ్రామాల్లో ఏళ్ల తరబడి భూసమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. భూసమస్యల కారణంగా గ్రామాల్లో హత్యలు, హత్యాయత్నాలు, ఘర్షణలు జరిగాయి. దీంతో కేసులు నమోదు కాబడి జైళ్లకు వెళ్తున్నారు. అంతేకాకుండా భూసమస్యలు పరిష్కారం కాకపోవడంతో కొందరు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ లక్షల్లో డబ్బు ఖర్చు చేస్తున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని భూసమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి వెబ్‌సైట్‌ను అమలులోకి తీసుకవచ్చింది. దాని ద్వారా పలు సమస్యలు పరిష్కారం కాగా ఇంకా ఎక్కువ సంఖ్యలో భూసమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఎక్కువగా భూసమస్యలకు సంబంధించిన అర్జీలు వస్తున్నాయి. వీటిని గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తేవ డంతో పాటు ముందస్తుగా భూముల సర్వేకు శ్రీకారం చుట్టబోతోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సర్వే నిర్వహించేందుకు అధికారులు సిద్ధం ఉన్నారు.

11 ఏళ్ల బీజేపీ పాలనలో 68 సార్లు ఉగ్రదాడులు


నేరేడుచర్లలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో బీజేపీ ఉన్న ఈ 11 ఏళ్లలో 68 సార్లు ఉగ్రదాడులు జరిగాయని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వివిధ రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరిగే సమయంలోనే ఉగ్రవాదులు దాడులు జరడగం, బీహార్ ఎన్నికలకు ఒక రోజు ముందు ఉగ్రవాద పేలుళ్ల జరగడం అనుమానంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఉగ్రదాడులు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, చిలకరాజు శ్రీణు, కొమర్రాజు వెంకట్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

హుజూర్‌నగర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ బండి మోహన్ కోరారు. బుధవారం పట్టణంలోని గోపాలపురం, కోదాడ రోడ్డు ప్రాంతాల్లో రోడ్డు స్లాపర్లను ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎస్ఐ బలరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో అన్నదానం

కోదాడ: కోదాడ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానానికి పట్టణానికి చెందిన ఆర్వపల్లి మణినాగేందర్ రూ 18వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్వపల్లి శ్రీదేవి, రాఘవమాలిక, మారెళ్ల పుల్లారెడ్డి, నాగమణి, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలి

మద్దిరాల: ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకురావాలని తహసీల్దార్ అయేషాపర్వీనా అన్నారు. బుధవారం మండలంలోని గోరెంట్ల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి: ఈ నెల 15న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అనంతగిరి ఎస్ఐ నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని రాజీకి అవకాశమున్న కేసులను ఇది మంచి అవకాశమన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్: విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి పులి రాఖి కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని బాలుర వసతి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కోదాడలో ఈనెల 16న డివిజన్ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమేష్, రాకేష్, సాయి పాల్గొన్నారు.

19న పుల్లారెడ్డి వర్ధంతి సభ

నూతనకల్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19న నిర్వహించే బారతవి ప్లవోద్యమ నాయకుడు చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు గంట నాగయ్య, పెద్దింటి రంగారెడ్డి కోరారు. బుధ వారం నూతనకల్‌లో వర్ధంతి సభ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు.

విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలన

నూతనకల్: మండలంలోని పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల హాజరు పట్టికలను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాములు నాయక్, గోపగాని సోమయ్య, గుండగాని శ్రీనివాస్, యోగానంద్, బిక్షపతి, సీఆర్పీలు జానకిరాములు, వీరస్వామి పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావడం అభినందనీయం

నూతనకల్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మండల నోడల్ అధికారి డి.శివయ్య అన్నారు. బుధవారం మండలంలోని అలుగునూరు ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పట్టేటి వెంకటయ్య కుమారుడు ఎస్ఐ రవి ఎస్ఐ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఉప్పు నాగయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి ప్రజలు సహకరించాలి

సూర్యాపేట టౌన్: అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో మురుగు కాల్వలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో అంజద్‌అలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిలుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ

చిలుకూరు: టీ శాట్- టీఎస్ జీహెచ్‌ఎంఏలు సంయుక్తంగా ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పోటీల్లో భాగంగా జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిలుకూరు ఉన్నత పాఠశాలకు చెందిన బాలెబోయిన రవి ప్రథమ స్థానం నిలిచారు. రవిని పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్వేయర్లు ఫీల్డ్‌పై అవగాహన పెంపొదించుకోవాలి

చిలుకూరు: ప్రభుత్వం ఎంపిక చేసిన లైసెన్ సర్వేయర్లు ఫీల్డ్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలి తహసీల్దార్ ధ్రువకుమార్ అన్నారు. మండలంలోని బేతవోలు గ్రామంలో బుధవారం శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ నాగార్జున, ఆర్ఐ ఉన్నారు.

డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పెన్‌పహాడ్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల కమిటీని బుధవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లెదు నరేందర్, ప్రధాన కార్యదర్శిగా గంటేపొంగి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.యోగానంద, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

నాగారం: ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ హరికిషోర్‌శర్మ అన్నారు. బుధవారం మండలంలోని పసునూరు ఐకేపీ కేంద్రంలో సన్న ధాన్యం కొనుగోళ్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భీమ్‌సింగ్, ఏవో కృష్ణకాంత్, ఏపీఎం శోభ, ఏఈవో సాయిరాజ్, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

గరిడేపల్లి: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రజాకళాకారుడు బాదె నర్సయ్య అన్నారు. బుధవారం మండలంలోని వెలిదండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుచ్చారావు,సీవీ రావు, అంజనేయులు, వెంకటరెడ్డి, సువర్ణ, రామారావు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనందిస్తాం

చిలుకూరు: తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు చేయూతనందిస్తామని ప్రియాంక ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రస్టు చైర్మన్ భట్టు శ్రీనివాస్ అన్నారు. తన కుమార్తె ప్రియాంక పుట్టినరోజు సందర్భంగా బుధవారం మండలంలోని జానకినగర్ గ్రామంలో కళామె కాంస్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం కోదాడలో అనాథ పిల్లలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శివాజీనాయక్, శ్రీనివాస్, లీలాబాయి, కేవల్‌పంత్, లాలు, పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత అభినందనీయం

మునగాల: ఎంబీబీఎస్ సీట్ సాధించిన విద్యార్థి సౌజన్యకు ఆర్థికసాయం అందించడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఎల్.శ్రీనుమాదిగ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఎల్.నాగరాజు, కల్పనల కుమార్తె సౌజన్య ఎంబీబీఎస్ సీటు సిద్ధిపేటలోన సురభి వైద్య కళాశాలో వచ్చింది. సౌజన్య తండ్రి ఆటో డ్రైవర్, తల్లి కల్పిన క్యాన్సర్‌తో నెల రోజుల క్రితం మృతి చెందింది. విద్యార్థిని కుటుంబ పరిస్థిని తెలుసుకున్న నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన మోలుగూరు కోటయ్య కుమారుడు రవికిరణ్, తన మరో 15మంది స్నేహితులత సాయంతో రూ.లక్ష చెక్కును విద్యార్థి సౌజన్యకు ు. ఈ కార్యక్రమంలో ఇరుగు ఉదయ్, ముత్తయ్య, నాగేశ్వరరావు, శివయ్య, సుమంత్, గుణశేఖర్, రాజు తదితరులు ఉన్నారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నాగారం: తుపాను కారణంగా కురిసిన వర్షాలకు రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొట గోపి అన్నారు. బుధవారం మండలంలోని సీపీఎం మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగు మారిందని రైతులను దగా చేస్తున్న రైస్‌మిల్లులపై చర్యలు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పులుసు సత్యం, దేవరకొండ యాదగిరి, గూడపూరి వెంకటేశ్వర్లు, కడియం కుమార్, దడిగ పిచ్చయ్య పాల్గొన్నారు.

యాసంగి సీజన్‌కు యూరియా కొరత లేదు

తుంగతుర్తి: యాసంగి సీజన్‌కు యూరియా కొరత లేదని వ్యవసాయ సహాయ సంచాలకుడు రమేష్‌బాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలించారు. ప్రతి రైతుకూ దుకాణదారులు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఔదార్యం

నాగారం: మండలంలోని ఫణిగిరి గ్రామంలో రైతులు వెళ్లే బాట బంధం మైసమ్మ గుడి నుంచి నాగారం వరకు సొంత ఖర్చులతో రిటైర్డ్ ఉపాధ్యాయుడు జంగిలి ఉపేందర్‌రావు ఎక్స్‌కవేటర్‌తో ఇరువైపులా కంపను తొలగింపజేసి మొరం పోయించారు. ఔదార్యం చాటిన ఉపేందర్‌వుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు జాన్ వెస్లీ, నాగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.